## మాజీ మంత్రిని కలిసిన అమీన్‌పూర్ నేతలు

మాజీ మంత్రి హరీశ్ రావును కలిసిన అమీన్‌పూర్ బీఆర్ఎస్ నాయకులు

అమీన్‌పూర్ జనవరి 23 : అమీన్‌పూర్‌లో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని బీఆర్ఎస్ నాయకులు సునీత, రాజగౌడ్ పేర్కొనారు. ఈ సందర్భంగా గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావును తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఫిబ్రవరి 2న కాట సునీత, రాజు గౌడ్ ఆధ్వర్యంలో అమీన్‌పూర్‌లో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరు కావాలని కోరారు. నాయకుడు ఆదర్శ్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, నేతలు రాజేశ్‌గౌడ్, బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి రవి కిరణ్‌రెడ్డి యూత్ నాయకుడు మానిక్ ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ఝరాసంగంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం, జనవరి 23 : ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానల్లో ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎన్నో నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆసరాగా నిలుస్తున్నదని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. గురువారం ఝరాసంగం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 13 మంది బాధితులకు రూ. 3.55 లక్షల చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశం, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్, మాజీ అధ్యక్షుడు సంగమేశ్వర్, ఝరాసంగం పట్టణాధ్యక్షుడు ఏజాజ్ బాబా, ఎస్‌కే సోహెల్, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

### గుంజొట్టికి బస్సు సర్వీసును నడించేలా చర్యలు తీసుకోవాలి

జహీరాబాద్, జనవరి 23 : న్యాల్‌కల్ మండలంలోని గుంజొట్టి గ్రామానికి బస్సు నడిపించేలా చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆదేశించారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనకు గుంజొట్టి గ్రామానికి చెందిన నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే ఎమ్మెల్యే ఫోన్‌లో డిపో మేనేజర్‌తో మాట్లాడారు. గుంజొట్టి గ్రామానికి బస్సు సర్వీసును నడిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## గోల్‌మాల్ చేయడానికి గ్రామసభలు

### బీఆర్ఎస్ నేత, జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్ పల్లె సంజీవయ్య

సమావేశంలో మాట్లాడుతున్న పల్లె సంజీవయ్య

చౌటకూర్, జనవరి 23 : ప్రజలను గోల్‌మాల్ చేయడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నారని, తద్వారా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుయుక్తులు పన్నుతున్నదని బీఆర్ఎస్ నేత, జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె సంజీవయ్య, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాశపాగ ఇమ్మయ్య ఆరోపించారు. మండలంలోని తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు, ఆర్థిక సాయం అందడం లేదని మండిపడ్డారు. అదిచేస్తాం.. ఇదిచేస్తాం అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాటలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎర్రోల్ల పోచయ్య, సంతోశ్, డాకూరి ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## జాబ్ మేళాకు విశేష స్పందన

జాబ్ మేళలో మాట్లాడుతున్న మహ్మద్ తన్వీర్

జహీరాబాద్, జనవరి 23 : మాజీ మంత్రి, దివంగత నేత ఎండీ. ఫరీదుద్దీన్ జ్ఞాపకార్థం జహీరాబాద్ నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళా విజయవంతమైనట్లు టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన జాబ్ ఫెయిర్-కెరియర్-ఎక్స్‌పో జాబ్‌మేళాకు నిరుద్యోగ యువతీ, యువకులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 110 కంపెనీల ప్రతినిధులు, అధికారులు హాజరైనట్లు పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో 600 మంది నిరుద్యోగ యువతీ, యువకులను ఎంపికచేశారన్నారు. అందులో 300 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు వెంటనే ఉద్యోగ నియామక పత్రాలను అందజేశామని తెలిపారు.

## ప్రభుత్వభూమిని ఇండ్ల స్థలాలకు కేటాయించాలి

తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే మాణిక్ రావు

ఝరాసంగం, జనవరి 23 : మండల పరిధిలోని మాచనూర్ గ్రామ శివారులో గల 100/12 సర్వే నెంబర్‌లోని 4 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేశారు. చుట్టూ కంచెను వేసినా వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, ఆ స్థలమును ఇండ్ల స్థలాలకు కేటాయించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు తహసీల్దార్ తిరుమలరావును ప్రశ్నించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. 2006లో రెవెన్యూ అధికారులే ఆ భూమిని పంచనామా చేసి గ్రామానికి చెందిన నిరుపేదలకు ఇచ్చినట్లు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశం ఎమ్మెల్యే ముందు అధికారులకు తెలిపారు.

## ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

అమరవీరుల స్తూపం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యమకారులు

గుమ్మడిదల, జనవరి 23 : కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఉద్యమకారులు అమరవీరుల స్తూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని దోమడుగులో తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారులు మంద భాస్కర్‌రెడ్డి, మంగయ్య, కుమ్మరి వెంకటేశ్, కాళేశ్వర్, ముద్దంగుల గోపాల్, దర్గాశ్రీనివాస్, రామకృష్ణ, యాదగిరి తదితరులు అమరవీరుల స్తూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్ గంగాభవానీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులను నివేదిస్తానని ఆమె తెలిపారు. ఉద్యమకారులు రాజు, జీవన్‌కుమార్,కృష్ణ, కుమ్మరి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

రాయికోడ్, జనవరి 23 : మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఉన్న అదర్శ పాఠశాలలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని మండల ప్రత్యేక అధికారి జగదీశ్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఉన్న అదర్శ పాఠశాలను సీసీ రోడ్డుకు వేసేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య భూమిపూజ చేశారు. మాజీ డీసీఎంఎస్ సిద్దన్నపాటిల్, అలయ కమిటీ చైర్మన్ సతీశ్ పంతులు ఉన్నారు.

## బీఆర్టీయూ నాయకుడి చొరవతో డ్రైవర్లకు వేతనాలు

జిన్నారం (బొల్లారం) జనవరి 23 : జిన్నారం మండలం బొల్లారం పారిశ్రామిక వాడలోని ధనలక్ష్మి ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ రెడీమిక్స్ పరిశ్రమ యజమాన్యం 21 మంది డ్రైవర్లకు మూడు నెలల వేతనాలను చెల్లించడం లేదని బాధిత డ్రైవర్లు బీఆర్టీయూ రాష్ట్ర నాయకులు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి సింగ్‌ను ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై స్పందించిన రవి సింగ్ సదరు పరిశ్రమ యజమాన్యంతో చర్చించి డ్రైవర్లకు రావలసిన మూడు నెలల వేతనాలు రూ.19 లక్షలు చెక్కుల రూపంలో స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా రెడీమిక్స్ డ్రైవర్లు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

వట్‌పల్లి : నాగులపల్లిలో అనర్హులకు పథకాలు ఎంపిక చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఝరాసంగం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్ రావు

# మూడోరోజూ నిరసనల వెల్లువ

- గ్రామసభల్లో లొల్లి
- జిల్లాలోని పలుచోట్ల గ్రామసభల్లో రసాభసా
- గ్రామసభలో నారాయణఖేడ్ ఎమ్మెల్యేపై తిరగబడిన జనం
- నేటితో ముగియనున్న గ్రామసభలు

జిన్నారం: మాదారంలో అధికారులతో లబ్ధిదారుల ఎంపికపై వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి జనవరి 23 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ సర్కార్‌పై గ్రామసభల్లో ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు. ప్రభుత్వ పథకాల అమలులో కాంగ్రెస్ కార్యకర్తలకు పెద్దపీట వేస్తున్నారని గ్రామసభల్లో పాల్గొన్న జనం రేవంత్ సర్కార్‌పై మండిపడుతున్నారు. ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్తరేషన్‌కార్డులు, రైతుభరోసా పథకాలు అనర్హులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు అందజేస్తున్నారని గురువారం జిల్లాలో పలుచోట్ల గ్రామసభల్లో ప్రజలు ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. దీంతో గ్రామసభలు రసాభసాగా మారాయి. ప్రభుత్వ పథకాల అమలులో జరుగుతున్న లోపాలను ప్రజలు నిలదీస్తుండటంతో అధికారులకు వారి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా గ్రామసభల్లో పాల్గొన్న ప్రజలు తగ్గకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు అధికారులకు పెద్ద ఎత్తున దరఖాస్తులు అందజేశారు. కొత్తరేషన్ కార్డుల కోసం 20,563, ఇందిరమ్మ ఇండ్ల కోసం 8243, ఇందిరమ్మ ఆత్మీయభరోసా కోసం 1461, రైతుభరోసాకు 409 మంది దరఖాస్తులు ఇచ్చారు. అందోలు మండలం నేరేడిగుంటలో నిర్వహించిన గ్రామసభలో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. గ్రామంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడంతోపాటు అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. గ్రామానికి కొత్త పీహెచ్‌సీ మంజూరు చేస్తామని మంత్రి దామోదర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

### నారాయణఖేడ్ ఎమ్మెల్యేపై తిరగబడిన జనం

నారాయణఖేడ్ మండలం అనంతసాగర్ గ్రామసభలో పాల్గొన్న జనం ఎమ్మెల్యే సంజీవరెడ్డిపై తిరగబడ్డారు. గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి కేసీఆర్ సర్కార్ పదేండ్లలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని ఇంటింటికి తాగునీరు ఇస్తామని ఇవ్వలేదని ఆరోపించారు. దీంతో గ్రామసభలో పాల్గొన్న జనం ఎమ్మెల్యే సంజీవరెడ్డిపై తిరగబడ్డారు. కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా తమ గ్రామంలో ఇంటింటికీ తాగునీరు ఇచ్చారని కావాలంటే గ్రామంలోకి వచ్చి చూడాలంటూ జనం ఎమ్మెల్యే సంజీవరెడ్డిపై తిరగబడ్డారు. సీఎం కేసీఆర్ హయాంలో ఇంటింటికి తాగునీరు ఇవ్వటంతోపాటు అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. మనూరు మండలం పులకుర్తి గ్రామసభలో ఆత్మీయభరోసా పథకం అర్హులకు ఇవ్వటంలేదని ప్రజలు అధికారులను నిలదీశారు. నాగల్‌గిద్ద గ్రామంలో జరిగిన గ్రామసభలో ప్రజలు ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం అర్హులకు ఇవ్వడంలేదని, హైదరాబాద్‌లో నివాసం ఉన్నవారిని లబ్ధిదారులుగా ఎంపిక చేసినట్లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిర్గాపూర్ మండలం ముబారక్‌పూర్ గ్రామంలో రైతుభరోసా ఎందుకు ఇవ్వడంలేదని ప్రజలు అధికారులను ప్రశ్నించారు. కల్హేర్ మండలం కిష్టాపూర్‌లో ఆత్మీయభరోసా పథకం అర్హులకు ఎందుకు ఇవ్వడంలేదని అధికారులతో గొడవకు దిగారు. దీంతో అధికారులు అర్థంతరంగా గ్రామసభను ముగించి వెనక్కిమళ్లారు. పటాన్‌చెరు మండలం నందిగామ, భానూరు, లక్డారం, చిట్కుల్ గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో రసాభసా చోటు చేసుకుంది. ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డులు అర్హులకు ఇవ్వటంలేదని ప్రజలు అధికారులను నిలదీశారు.

జిన్నారం మండలంలోని జిన్నారం, మాదారం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక సరిగ్గా జరలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని అధికారులను డిమాండ్ చేశారు. హత్నూర మండలంలోని సికింద్లాపూర్, నవాబ్‌పేట, రెడ్డిఖానాపూర్, గుండ్ల మాచనూరు, హత్నూరలో నిర్వహించిన గ్రామసభలో రసాభసా చోటు చేసుకుంది. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందటంలేదని ప్రజలు అధికారులను నిలదీశారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలని పట్టుబట్టారు. దీంతో అధికారులు అర్హులైన వారందరికీ పథకాలు వర్తింపజేస్తామని దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. వట్‌పల్లి మండలం నాగులపల్లి, మునిపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొన్న ప్రజలు ప్రభుత్వ పథకాలు అర్హులకు వర్తింపజేయటంలేదని అధికారులను నిలదీశారు. జోగిపేట మున్సిపాలిటీలోని మూడోవార్డులో నిర్వహించిన వార్డు సభలో ప్రజలు అర్హులకు ప్రభుత్వ పథకాలు ఎందుకు ఇవ్వటంలేదని అధికారులను ప్రశ్నించారు. వార్డు సభలో ప్రజలు అర్హులకు అందరికీ ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని గొడవ చేయటంతో అధికారులు వెంటనే వార్డు సభ ముగించి తిరుగుముఖం పట్టారు.

### కాంగ్రెస్ నేత ఇంటివద్ద గ్రామసభ నిర్వహణపై రగడ

జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్ తండాలో కాంగ్రెస్ నేత ఇంటిఎదుట గ్రామసభ నిర్వహణకు ఏర్పాట్లు చేయటంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిర్వహించాల్సిన గ్రామసభ కాంగ్రెస్ నేత ఇంటి వద్ద ఎలా నిర్వహిస్తారని ప్రజలు అధికారులను నిలదీశారు. కాంగ్రెస్ నేత ఇంటివద్ద గ్రామసభ నిర్వహిస్తే తాము సభలో పాల్గొనమని వెంటనే సభ వేరచోటకి మార్చాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై బీఆర్ఎస్ నాయకులు అధికారులను ప్రశ్నించటంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. చివరకు పోలీసులు కలుగజేసుకుని కాంగ్రెస్‌నేత ఇంటివద్ద గ్రామసభ నిర్వహించకుండా వేరేచోట గ్రామసభ నిర్వహించటంతో గొడవ సద్దుమణిగింది. న్యాల్‌కల్ మండలం మామిడ్గి గ్రామసభలో రైతులు రుణమాఫీ ఎందుకు చేయటంలేదని అధికారులను నిలదీశారు. గ్రామంలోని చాలా మంది రైతులకు రుణమాఫీ జరగలేదని వెంటనే ప్రభుత్వం అందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నిమ్జ్‌లో భూములు కోల్పోయిన రైతులు గ్రామసభలో నిరసన వ్యక్తం చేశారు. నిమ్జ్ కోసం తమభూములు సేకరించినట్లు అధికారులు ప్రకటించినా ఇప్పటి వరకు పరిహారం అందలేదన్నారు. తమపేర్లును రైతుభరోసా జాబితాలో చేర్చలేదన్నారు. తమ భూములు నిమ్జ్‌కు ఇవ్వలేదని వెంటనే తమ పేర్లు రైతుభరోసా జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఝరాసంగం మండలం జీర్లపల్లి, ఝరాసంగం, ఏడాకులపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో రసాభాస చోటు చేసుకుంది. ప్రజలు అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలంటూ అధికారులను నిలదీశారు.

సిర్గాపూర్ : పెద్ద ముబారక్‌లో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

మనూరు : పుల్‌కుర్తిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

రాయికోడ్ గ్రామ సభలో అధికారులకు తెలుపుతున్న మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు విఠల్

అందోల్‌లో ప్రజాపాలన వార్డుసభలో దరఖాస్తులు అధికారులపై విసిరికొడుతున్న ఓలబ్ధిదారుడు

అందోల్ : నేరడిగుంటలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

పటాన్‌చెరు : చిట్కుల్ గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

## రసాయన పరిశ్రమ వద్దని వినతి



తహసీల్దార్ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంకటాపూర్ గ్రామస్తులు

కోహీర్, జనవరి 23 : తమ గ్రామంలో బయో కెమికల్ ప్లాంట్ పనులను వెంటనే నిలిపివేయించాలని వెంకటాపూర్ గ్రామస్తులు గురువారం కోహీర్‌లోని తహసీల్దార్ బాలశంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటాపూర్‌లోని సర్వే నం.65లో ప్లాంటును ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారని తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. ప్లాంటు ఏర్పాటు చేస్తే మరో కాలుషరహిత దిగ్వాల్‌గా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ సిబ్బంది మిషన్ భగీరథ పైపులను ధ్వంసం చేశారని మండిపడ్డారు. వర్షం నీటి వాగు దారిని కూడా మళ్లిస్తున్నారని వివరించారు. పరిశ్రమ స్థాపన కోసం చేపట్టిన పనులను వెంటనే నిలిపివేయించాలని విన్నవించారు. సమాచార హక్కు కార్యకర్త రాణెమ్మ, ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాజశేఖర్, మల్లికార్జున్, అంజయ్య, మాజీ ఎంపీటీసీ అశోక్, బీఆర్ఎస్ నాయకుడు రాజు, కృష్ణ, వెంకటేశం, అనిల్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే విమర్శలకు ప్రజల కౌంటర్

నారాయణఖేడ్, జనవరి 23 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదని, మిషన్ భగీరథ పథకం ద్వారా ఏ ఒక్క గ్రామంలోనూ సరైన పనులు చేపట్టలేదని విమర్శించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డికి చుక్కెదురైంది. గురువారం నారాయణఖేడ్ మండలం అనంతసాగర్‌లో జరిగిన గ్రామసభలో పాల్గొన్న ఎమ్మెల్యే కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తుండగా, వెంటనే స్పందించిన ప్రజలు ఎమ్మెల్యేకు గట్టి కౌంటర్ ఇచ్చారు. ఏ గ్రామంలోనూ మిషన్ భగీరథ పనులు జరగలేదని చెప్పడం సరికాదని, తమ గ్రామంలోనే ఇంటింటికీ ఏర్పాటు చేసిన నల్లాలను చూపిస్తామన్నారు. గ్రామంలో పర్యటించి ప్రతి ఇంటి ముందు ఏర్పాటు చేసిన నల్లాలను చూడాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరగా, తాను మరో రోజు వచ్చి నల్లాలతో పాటు అన్ని అభివృద్ధి పనులు పరిశీలిస్తానని దాటవేశారు.

## మహిళ అదృశ్యం

కల్హేర్, జనవరి 23 : మహిళ అదృశ్యమైన ఘటన నిజాంపేట్ మండల పరిధిలోని నాగ్‌దర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. నాగ్‌దర్ గ్రామానికి చెందిన రామన్నగారి లక్ష్మి (53) 20వ తేదీ ఉదయం ఇంటి నుంచి వెళ్లింది. ఆమె మానసిక స్థితి బాగాలేదని బంధువులు, చుట్టు ప్రక్కల ప్రాంతాలల్లో వెతికిన ఆచూకీ దొరకలేదు. కుమారుడు రామన్నగారి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

ఫ్లోరింగ్ పనులను పరిశీలిస్తున్న ప్రొటెం మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి

రామచంద్రాపురం,జనవరి 23 : గీతాభూపాల్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నామని మాజీ ప్రొటెం చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి జరుగుతున్న ఫ్లోరింగ్ పనులను పరిశీలించారు. అనంతరం కళాశాల సిబ్బందితో స మావేశమయ్యారు. ఉతీర్ణత శాతాన్ని కూడా మెరుగుపర్చాలని, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా చూడాలని ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డికి సూచించారు. బీఆర్ఎస్ నేతలు ఆదర్శ్ రెడ్డి, కుమార్‌గౌడ్, అంజయ్య, జగన్నాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

జీహెచ్ఎంసీ లో మాజీ మంత్రులతో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, జనవరి 23 : పటాన్‌చెరు డివిజన్ అభివృద్ధికి జీహెచ్ఎంసీ నిధులు విడుదల చేయాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు కమిషనర్ ఎల్లంబర్తిని కోరారు. గురువారం నగరంలోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చిన మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్, మహమూద్ అలీ, సబిత ఇంద్రారెడ్డిల తదితరుల నేతృత్వంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి జీహెచ్ఎంసీ నిధులను అన్ని డివిజన్లకు అందజేయాలని వినతి చేశారు. కమిషనర్ సానకూలంగా స్పందించారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ తన డివిజన్లో ఆగిపోయిన అభివృద్ధి పనులను వివరించారు. పటాన్‌చెరు డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిధులు కోరామన్నారు.

## పశు వైద్య శిబిరం విజయవంతం

జిన్నారం (బొల్లారం) జనవరి 23 : జిన్నారం మండలం లక్ష్మీపతి గూడెంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ రైతులు గోపాలమిత్రలు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా గోపాలమిత్ర సూపర్‌వైజర్ అర్జునయ్య, గోపాలమిత్ర నరేశ్ కుమార్, అనిల్ కుమార్ రైతులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, జనవరి 23: కల్హేర్ మండలం మిర్కాన్‌పేట్ గ్రామానికి చెందిన ఎస్సై నారాయణ మాతృమూర్తి అదే గ్రామానికి చెందిన నీరుడి రాములు తండ్రి మృతి చెందారు. గురువారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మండలాధ్యక్షుడు రాంసింగ్, రాపర్తి మాజీ సర్పంచ్ శ్రావణ్ కుమార్, ఉప సర్పంచ్ రాజు, నాయకులు ఉన్నారు.

## మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన డీఈవో

సిర్గాపూర్, జనవరి 23 : మండలంలోని ముబారక్‌పూర్ గ్రామాన్ని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు గురువారం సందర్శించి స్థానిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈమేరకు మధ్యాహ్న భోజనం పని తీరును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని వంట కార్మికులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంపై డీఈవో సంబంధిత టీచర్‌ను ప్రశ్నించారు. విద్యార్థుల సంఖ్య పెంచి, ప్రాథమిక విద్యాబ్యాసాన్ని మెరుగు పరిచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో నాగారం శ్రీనివాస్, సీఆర్‌పీ శివ కుమార్ స్వామి ఉన్నారు.

## పన్ను చెల్లించని ట్రావెల్స్ బస్సును స్వాధీనం చేసుకున్న అధికారులు

జహీరాబాద్, జనవరి 23 : పన్ను చెల్లించకుండా ప్రయాణికులను తరలిస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును జహీరాబాద్ రోడ్డు రావాణా శాఖాధికారులు పట్టుకున్నారు. గురువారం మొగుడంపల్లి మండలం చిరాగ్‌పల్లి ఆర్టీఏ చెక్కుపోస్టు వద్ద ఆర్టీఏ అధికారుల వాహనాలను తనిఖీలు చేపట్టారు. ముంబయి నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికులతో వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును ఆపి సంబంధిత పత్రాలను పరిశీలించారు. మహారాష్ట్రకు మాత్రమే రవాణా పన్నులు చెల్లించి, తెలంగాణకు ఎలాంటి పన్నులు చెల్లించకుండానే ప్రయాణికులు తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు